# మాధవ సేవ

పరంజ్యోతి ఆ వీధి మలుపు తిరుగుతున్నప్పుడు ఒక మనిషి ఆయనకు దగ్గరగా వచ్చి – "మీరు నాకో సాయం చెయ్యాలి" అన్నాడు.

ఆ మనిషి ఎవరో పరంజ్యోతికి తెలీదు. ఇంతకముందు ఎప్పుడూ అతన్ని చూసిన గుర్తు కూడా లేదు. "వివరంగా చెప్పండి" అన్నాడు పరంజ్యోతి.

"నా పేరు జాన్సన్. వరంగల్లు నుంచి వచ్చాను. ఈ వూళ్ళో నాకో స్నేహితుడు వున్నాడు. అతని పేరు రామజోగి. ఓ బేంక్‌లో జాబ్ చేస్తున్నాడు. అతను ఎక్కడో ఈ ప్రాంతంలోనే వున్నాడు. అతని ఇంటికోసం గంటనుంచి వెతుకుతున్నాను. ఎవ్వరూ చెప్పలేకపోయారు. కనీసం మీకు తెలిస్తే దయచేసి అతని ఇల్లు ఎక్కడో చెప్పండి" అన్నాడు అర్థింపుగా.

"సారీ.... అడ్రసు కాయితం తీసుకురావడం తొందరలో మరచిపోయాను. కానీ ఒక విషయంమాత్రం బాగా గుర్తుంది"

"ఏమిటది?"

"అతని ఇల్లు వినాయకుడి గుడి దగ్గరలో వుంటుందట. ఈ వూళ్ళో ఒకే ఒక్క వినాయకుడి గుడి వుందని రామజోగి ఆర్నెల్ల క్రితం వరంగల్లు వచ్చినప్పుడు చెప్పాడు"

పరంజ్యోతి కనులు మెరిశాయి. అతను ఎప్పుడో రోడ్డుమీద వెళుతున్నప్పుడు ఓ ఇంటి గోడకు తలిగించి వున్న బోర్డు కనుల ముందు కదిలింది.

గుర్తుచేసుకునే ప్రయత్నం చేస్తున్నప్పుడు చిన్నగా వర్షం మొదలయింది.

"రండి.... మా ఇంట్లో కూర్చుందాం" అని ఆ వీధి మొదట్లోనే వున్న తన ఇంటికి జాన్సన్‌ను తీసుకువెళ్ళాడు పరంజ్యోతి.

ముందుగదిలో కూర్చున్న తర్వాత భార్యను పిలిచి.... "ఈయన జాన్సన్‌గారు. నా స్నేహితులు, వరంగల్లు నుంచి వచ్చారు" అని చెప్పాడు.

పరంజ్యోతికి రామజోగి ఇల్లు ఎక్కడో గుర్తుకువచ్చింది.

"ఈ వెనకరోడ్డులోనే మీ స్నేహితుడి ఇల్లు వుంది" అన్నాడు పరంజ్యోతి – జాన్సన్‌తో.

సరిగ్గా అప్పుడే కాఫీకప్పును జాన్సన్‌కు అందిస్తూ 'కాఫీ తాగండి.... మీ

స్నేహితుడి ఇంటికి తీసుకువెళతాను' అన్నాడు.

జాన్సన్ గబగబా కాఫీ తాగాడు.

బయట వర్షం తగ్గిపోయింది.

ఓ ఐదు నిముషాలకు పరంజ్యోతి - జాన్సన్‌ను వెనుకరోడ్డులో వున్న రామజోగి ఇంటికి తీసుకెళ్ళాడు. వాళ్ళు వెళ్ళేసరికి రామజోగి ఇంట్లోనే వున్నాడు. పరంజ్యోతిని - జాన్సన్ రామజోగికి పరిచయం చేశాడు. తన ఇల్లు చూపించినందుకు స్నేహితుడితోపాటు రామజోగి కూడా పరంజ్యోతికి కృతజ్ఞతలు తెలియజేశాడు.

కొంచెసేపటికి పరంజ్యోతి ఇంటికి తిరిగివచ్చిన తర్వాత అతని భార్య నవ్వుతూ ఇలా అడిగింది -

"ఎవరీ కొత్త స్నేహితుడు? ఈయన్ని ఎప్పుడూ చూళ్లేదు. ఈయన గురించి మీరు ఎప్పుడూ చెప్పలేదు కూడా".

పరంజ్యోతి నవ్వి జరిగినదంతా చెప్పి - "ఒక అపరిచిత వ్యక్తికి ఓ కప్పు కాఫీ ఇచ్చినందుకు బాధపడుతున్నావా?" అనడిగాడు.

"లేదండీ.... మీ గురించి, ఉన్నతమయిన మీ ఆశయం గురించి నాకు బాగా తెలుసు. ఏ మనిషినయినా నా స్నేహితుడు అని అనుకోవడం అందరికీ సాధ్యం కాదు. ఆ భావన కలగడానికి చాలా గొప్ప మనసు కావాలి. ఆ మనసు మీకు వుంది. నేనూ మీలో సగమనే విషయం మీరు గుర్తుంచుకుంటే అంతే చాలు" అన్నది ఆమె.

భార్య మాటలు పరంజ్యోతికి సంతోషాన్ని కలిగించాయి. ఆమె తనని పూర్తిగా అర్థం చేసుకుందని గ్రహించాడు.

ఆ రాత్రి గడిచింది.

మర్నాటి ఉదయం తొమ్మిది గంటల సమయంలో పరంజ్యోతి ఇంట్లోనుంచి బయటకు వస్తున్నప్పుడు జాన్సన్ వచ్చాడు.

ఇద్దరూ ముందుగదిలో ఎదురెదురుగా కూర్చున్నారు.

"మీలాంటి మనుషులు చాలా అరుదుగా వుంటారు" అన్నాడు జాన్సన్ ఉపోద్ఘాతంగా.

"నాకు తెలీదు" అన్నాడు పరంజ్యోతి నవ్వి.

"పక్క పోర్షన్‌లో వుంటున్న మనుషుల గురించి అడిగితేనే పట్టించుకోని

మనుషులున్న ఈ సమాజంలో మీలాంటివాళ్లు నిజంగానే చాలా అరుదుగా వుంటారు. మీరు నా స్నేహితుడి అడ్రసు చెప్పి పంపించకుండా, మీరే స్వయంగా నా స్నేహితుడి ఇంటికి నన్ను తీసుకువెళ్లారు. మీరు కనిపించకుండా వున్నట్లయితే నేను నా స్నేహితుడిని కలవకుండానే వెళ్లేవాడిని. నిజంగా ఒక ముఖ్యమైన పనిమీద వచ్చాను. మా అమ్మాయి పెళ్లి విషయంలో నా మిత్రుడు రామజోగిని కొంత డబ్బును అప్పుగా అడగాలని వచ్చాను. అడిగాను. అతను అంగీకరించాడు. ఇప్పుడు నేను సంతోషంగా ఇంటికి తిరిగివెళుతున్నాను. ఈ సంతోషానికి కారణం మీరే. మీకెలా కృతజ్ఞతలు తెలియజేసుకోవాలో తెలీటంలేదు.

"సరిగ్గా ఇం మాటని కొన్నాళ్ల క్రితం నేను దరియా హుసేన్‌గారితో అన్నాను" అన్నాడు పరంజ్యోతి చిన్నగా నవ్వి.

"దరియా హుసేన్ ఎవరు? కొంచెం వివరంగా చెప్పండి" అనడిగాడు జాన్సన్ కుతూహలంగా.

"తప్పకుండా చెబుతాను. అది నా జీవితాన్ని మార్చివేసిన సంఘటన. కొన్నాళ్ళ క్రితం ఓ ముఖ్యమైన పనిమీద హైదరాబాద్ వెళ్ళాను. ఓ హోటల్లో దిగాను. ఓ ఆఫీసులో నేనో డూప్లికేటు సర్టిఫికెట్ తీసుకోవాలి. కానీ ఆ ఆఫీసు స్టాఫంతా ఏదో పనిమీద బిజీగా వున్నారు. ఓ నాలుగు రోజుల తర్వాత రమ్మన్నారు. ఆ ఆఫీసు అధికారి దరియా హుసేన్. కొంచెం అర్జంటుగా కావాలని చెప్పాను. అప్పుడు ఆయన హైదరాబాద్ హోటల్లో ఓ నాలుగు రోజులు వుండడం కొంచెం ఖర్చుతో కూడుకున్న పని అని అనుకుని తనే రికార్డు రూంలోకి వెళ్ళి ఇరవై ఏళ్ళనాటి రికార్డును బయటకు తీసి రెండు గంటల్లో నాకు అవసరమైన డూప్లికేటు సర్టిఫికెట్‌ను ఓ కవర్లో వుంచి నా చేతికి ఇచ్చాడు. నాకు అంతులేని సంతోషం కలిగింది. ఇంత సులభంగా నా పని అవుతుందని అనుకోలేదు. తనొక ఆఫీసరయినా ఓ అటెండరు చెయ్యవలసిన పనిని తాను చేసి నా పని పూర్తిచేశాడు. అంతేకాదు – ఆయనే నాకు టీ కూడా తెప్పించాడు. నేను డబ్బులు ఇస్తానన్నా ఒప్పుకోలేదు. నాకు ఇంత సహాయపడిన ఆయనకు ఎలా కృతజ్ఞతలు తెలియజేసుకోవాలో తెలీలేదు. అదే మాట ఆయనతో అన్నాను.

"అప్పుడు ఆయన ఏమన్నారు?"

"మీరు నాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకోవలసిన అవసరం లేదు. ఎవరైనా ఏదయినా అవసరం వుండి మీ దగ్గరకు వస్తే మీరు చేయగలిగిన సహాయం అనుకుంటే ఏమాత్రం ఆలస్యం లేకుండా వెంటనే చెయ్యండి. అదే

మీరు నాపట్ల చూపించే కృతజ్ఞత" అన్నాడాయన.

"బావుంది"

"నేను కూడా మీకు అదే చెబుతున్నాను జాన్సన్‌గారూ.... అవసరమనేది ఎవరికయినా ఒకటిగానే వుంటుంది. అలాంటి అవసరం వున్న మనిషికి సాటి మనిషిగా మనం సాయం చెయ్యనప్పుడు మనం మనుషులుం కాదని నా నమ్మకం. నావల్ల సంతోషం పొందిన మీరు ఇలాంటి సంతోషాన్ని ఇంకొంత మంది మనుషులు మీవల్ల పొందేలా చూడండి. ఇదే మీరు నాపట్ల చూపించే కృతజ్ఞత" అని చెప్పాడు పరంజ్యోతి.

అప్పటివరకూ తను గడిపిన జీవితం గుర్తుకువచ్చిందేమో రెవెన్యూ డిపార్టుమెంటులో పనిచేసే ఆ జాన్సన్‌కు కళ్లలో నీళ్లు తిరిగాయి. ❖

*నవ్య వీక్లీ, 13-12-2006*